
ప్రజాశక్తి

సోమవారం 4 ఆగస్టు 2025 | 8 పేజీలు



తిరుపతి



చిత్తూరు

బోధనకు ఆటకం కలిగిస్తున్న

యాప్‌లను రద్దు చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- తిరుపతి సిటి: గిన్నిస్ బుక్ రికార్డుల కోసం పాఠశాల తెరిసిన తర్వాత యోగ పేరుతో, పిటిఎం పేరుతోటి ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి రకరకాల ఫోటోలు అప్లోడ్ చేయించడం పట్ల తీవ్ర నిరసన, వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో యుటిఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రకరకాల యాప్‌ల వల్ల పిల్లలకు అక్షరాలు, గణితం వస్తుందా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బోధనకి ఆటంకంగా ఉన్న అన్ని రకాల యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రకరకాల యాప్‌లు పిల్లల బోధనకు ఆటంకంగా ఉన్నాయని తెలిసినా పటీపట్లనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారుల వైఖరి పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యారంగ సంస్కరణల వలన పిల్లలకు నాణ్యమైనవిద్య వస్తుందని, కానీ ఆచరణలో పాఠశాలలు

2లో

ఫలించిన గ్రామస్తుల పోరాటం

రాచగున్నేరి చెరువులో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి చెరువు ఆక్రమణలపై కోర్టు కొరడా జులిపించింది. వ్యవసాయ అవసరాలకు వినియోగించాల్సిన చెరువులో అక్రమ కట్టడాలు ఎలా కడతారంటూ

2లో



గంటలో స్వామివారి దర్శనం అసంభవం

మాజీ ఈఓ, ఎల్వీ సుబ్రహ్మణ్యం సంచలన వ్యాఖ్యలు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనంలో ఏఐ వినియోగంపై మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆలయంలో గంటలో స్వామివారి దర్శనం అనేది అసంభవం అన్నారు. ప్రస్తుతం ఉన్న విధానాన్ని మించి దర్శనంలో మార్పు చేసే అవకాశం లేదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పేరుతో టీటీడీ ధనాన్ని వథా చేయడం మంచిది కాదన్నారు. ఇదిలా ఉంటే తిరుమలలో స్వామివారి దర్శనానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో బోర్డు తీర్మానం మేరకు ఈవో శ్యామలరావు కార్యాచరణ వేగవంతం చేశారు.

ఎఐ టెక్నాలజీపై అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం బాధాకరం: టిటిడి చైర్మన్

ప్రజాశక్తి- తిరుమల: టిటిడిలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విధానం అమలు చేయాలనే అంశాన్ని తప్పుబడుతూ మాజీ ఈవో, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలను ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా టిటిడి చైర్మన్ బీఆర్.నాయుడు ఖండించారు. తిరుమలలో శ్రీవారి క్యూ కాంప్లెక్సులలో సామాన్య భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు దష్టిలో పెట్టుకొని ఉచితంగా గూగుల్ / టిసిఎస్‌లతో పాటు ఇతర సంస్థల సహకారంతో అధునాతన ఏఐ టెక్నాలజీ ఉపయోగించి నిర్దేశించిన సమయంలోపు భక్తులకు దర్శనం కల్పించాలని టిటిడి పాలకమండలి చర్చించి నిర్ణయించిందని తెలిపారు. భక్తులకు దర్శన సమయం ముందుగా తెలియడం ద్వారా భక్తులు ఎక్కువ సమయం కంపార్ట్మెంట్‌లలో వేచియుండకుండా ఇతర ఆలయాలను సందర్శించేందుకు వీలుగా టిటిడి పాలక మండలి నిర్ణయించిందన్నారు. ఇలాంటి

2లో

తిరుమలకు చేరుకున్న కర్ణాటక గవర్నర్

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల పర్యటన నిమిత్తం విచ్చేసిన కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లోత్కి టిటిడి ఓఎస్‌డీ ఎంఎస్.నాయక్ స్వాగతం పలికి బస ఏర్పాట్లను చేశారు. సోమవారం ఉదయం విఐపి దర్శన సమయంలో శ్రీవారిని ఆయన దర్శించుకుంటారని అధికారులు వెల్లడించారు.



(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్న

యాప్‌లను రద్దు చేయాలి

కుదించడానికి, ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించడానికి తద్వారా ప్రభుత్వ పాఠశాల నుంచి పిల్లలు ప్రవేటు పాఠశాలలకు వెళ్లడానికి ఉపయోగపడిందని తెలిపారు. పాఠశాల సమయంలో కర్మయోగి, పి -4 సర్వే ద్వారా దత్తత తీసుకోవాలని ఒత్తిడి వల్ల బోధనకు ఆటంకం కలుగుతుందని అన్నారు. మే 19వ తేదీన ఉపాధ్యాయ సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ఆర్థిక శాఖ నుండి జీవో తెచ్చి బదిలీల అనంతరం ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం జీవో తెచ్చి రెండు నెలల పాటు జీతాలు రాకుండా ఉండటానికి కారుకులయ్యారని విమర్శించారు. ప్లస్ 2 పాఠశాలలను ఇప్పటివరకు అభివృద్ధిపరిచి పిల్లలను చేర్చడంలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయులను పక్కనపెట్టి ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌కి ప్లస్ టు పాఠశాలలను కేటాయించటాన్ని వ్యతిరేకిస్తున్నామని, కచ్చితంగా ప్లస్ 2 పాఠశాలలను మరిన్ని నెలకొల్పి అర్హత కలిగిన ఉపాధ్యాయులకు అధ్యాపకులుగా ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. పాఠశాలలను విలీనం చేసి ఇప్పుడు తిరిగి కొన్ని పాఠశాలలను కొనసాగిస్తున్నారని, ఆ పాఠశాలలకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై కేటాయించాలని, డీఎస్సీలో ఖాళీలు చూపి పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పేరుకు మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను ఫౌండేషన్ స్కూల్స్‌కు క్రమంగా డిప్యూటేషన్లు వేయడం వల్ల మోడల్ స్కూల్లో పోస్టులు ఇచ్చి ఉపయోగ లేకుండా పోయిందని అన్నారు. ప్రతి మండలానికి రిజర్వ్ టీచర్లని 10మంది వరకు కేటాయిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. మున్సిపాలిటీ టీచర్లకు తక్షణం పిఎఫ్ నంబర్లు కేటాయించాలని, ఉపాధ్యాయుల అవసరం ఎక్కువగా ఉన్న పాఠశాలలకు సమీప మండలాల నుండి డిప్యూటేషన్‌పై నియమించాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారుల అదనపు బాధ్యతల కేటాయింపులో కోర్టు సూచనలనుపాటించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఉమ్మడి సర్వీసులు సాధనకు అందరూ ఐక్యతతో పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని ప్రభుత్వం స్పందించుకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. పదవ తరగతి సోషల్, ఇంగ్లీష్ సిలబస్ మార్పు చేయాలని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌కి తెలియజేశామని వారు వెంటనే స్పందించి విద్యార్థుల స్థాయి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సవరణలు చేయాలని కోరారని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శులు సి.సురేష్, ఏ.పద్మజ, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.నాగరాజు పాల్గొన్నారు.

ఫలించిన గ్రామస్తుల పోరాటం

రాచగున్నేరి చెరువులో ఆక్రమణల తొలగింపు

ప్రశ్నించింది. గత ప్రభుత్వ హయాంలో ఓ ప్రైవేట్ పరిశ్రమలో సిఎస్ఓగా పనిచేస్తున్న ఓ వ్యక్తి తన పరపతిని వినియోగించి బినామీల పేరిట చెరువులో అక్రమ కట్టడాలు కట్టారు. దీనిపైన రాచగున్నేరి గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. శనివారం కోర్టు గ్రామస్తులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అక్రమ కట్టడాలు తొలగించాల్సిందిగా రెవిన్యూ అధికారులను ఆదేశించింది. ఆ మేరకు శ్రీకాళహస్తి మండల రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను తొలగించే పనిలో పడ్డారు. దీనిపై గ్రామస్తుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎఐ టెక్నాలజీపై అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం

బాధాకరం: టిటిడి ఛైర్మన్

సమయంలో విశ్రాంత సీనియర్ ఐఎఎస్ అధికారి, టిటిడి మాజీ ఈఓ ఎల్వీ సుబ్రహ్మణ్యం ఏఐ టెక్నాలజీపై అవగాహన లేకుండా వ్యాఖలు చేయడం బాధాకరమని టిటిడి ఛైర్మన్ ఖండించారు. ఒక సీనియర్ అధికారిగా పని చేసిన అనుభవం ఉన్న ఎల్వీ సుబ్రహ్మణ్యం, తిరుమలలో ఏఐ టెక్నాలజీ నిరుపయోగమని వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని, ఇలాంటి మాటలు భక్తుల్లో గందరగోళం సష్టించేలా ఉన్నాయన్నారు. దాతల సహాయంతో టిటిడిలో ఉచితంగా చేస్తున్న పనిని కూడా వృధా అని అనడం ఆయన విజ్ఞతకు వదిలేస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏఐ సాంకేతికతను ఉపయోగించి సేవలను సులభతరం చేస్తుంటే, అదే పద్ధతిలో ఏఐ టెక్నాలజీ ద్వారా టీటీడీలో కేవలం దర్శనం సమయాన్ని భక్తులకు ముందస్తుగా తెలియజేసేందుకు, మరింత సౌకర్యవంతంగా, సులభతరం చేసేందుకు మాత్రమే ఉపయోగించేలా నిర్ణయించామన్నారు. వాస్తవాలు ఇలా ఉండగా ఏఐ టెక్నాలజీకి స్వస్తి పలకమని ఎల్వీ సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలు సబబు కాదన్నారు.

మఠాలకు నోటీసులివ్వడం

హిందూ ధర్మాన్ని అవహేళన చేయడమే..

టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆగ్రహం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: టిటిడి మఠాలకు నోటీసులు ఇవ్వడం హిందూ ధర్మాన్ని అవహేళన చేయడమేనని టీటీడీ మాజీ ఛైర్మన్ భూముల కరుణాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలోని ఆయన నివాసంలో కరుణాకర్ రెడ్డి ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ప్రచారం చేసి, పరిరక్షించే తిరుమల కొండపై ఉన్న మఠాలకు నోటీసులు ఇవ్వడమంటే మఠాధిపతులను అవమానించడమేనని అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పడంతో పాటు నోటీసుల్లో మారణాయుధాలు, నిషేధిత వస్తువులు, పేలుడు పదార్థాలు రాకుండా తనిఖీ చేయాలని చెప్పడం చూస్తుంటే, మఠాల నిర్వహణ మీద అనుమానాలు వ్యక్తం చేయడమే అవుతుందని స్పష్టం చేశారు. హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తామని, హిందూ ధర్మ పరిరక్షణకు తామే బ్రాండ్ అంబాసిడర్లమని ప్రచారం చేసుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దీనికి సమాధానం చెప్పాలి. అత్యంత పవిత్రంగా స్వామివారికి సేవ చేయడంలోనే జీవితాన్ని గడిపేస్తున్న మఠాలకు నోటీసులిచ్చిన టీటీడీ, ధనికుల ఆధ్వర్యంలో నడుస్తున్న గెస్ట్ హౌస్‌లకు ఇవే నోటీసులు ఎందుకు ఇవ్వలేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తూ దాదాపు 32 మఠాల వరకు కొండ మీద కొనసాగుతుండగా, వాటికి కూటమి ప్రభుత్వం నోటీసులు జారీ చేసిందని, ఇది దేశవ్యాప్తంగా ఉన్న పీఠాధిపతులను తీవ్రంగా అవమానించడమే అని అన్నారు. హిందూ సనాతన ధర్మాన్ని పరిరక్షించడానికి నడుంబిగించామని ఊదరగొట్టిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సీఎం చంద్రబాబు ఈ నోటీసులకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. బ్రిటీష్ పాలకులు, ఆర్కాట్ నవాబుల కన్నా దారుణంగా బీఆర్ నాయుడు నేతత్వంలో హిందూ ధర్మాన్ని అణగదొక్కడానికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉసిగొల్పినట్టుగా ఉందని, మీ గెస్ట్ హౌస్‌ల వద్ద ఈ నిబంధనలు ఎందుకు పెట్టలేదని, ఇదే తిరుమల కొండ మీద వందలాది ధనవంతులతో నడుస్తున్న గెస్ట్ హౌస్‌లు, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పీఏసీలకు ఇలాంటి నోటీసులు ఎందుకివ్వలేదని అన్నారు. టీటీడీలో మఠాల మీద జరుగుతున్న దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని, ఇలాంటి చర్యలను వైయస్సార్సీపీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు.

తుంబుర తీర్థంను దర్శించుకున్న కలెక్టర్

ప్రజాశక్తి- తిరుమల: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఉదయం తిరుమలలోని పవిత్రమైన తుంబుర తీర్థంను దర్శించుకున్నారు. దర్శన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. తుంబుర తీర్థం అనేది సంవత్సరానికి ఒక సారి వచ్చే మార్చి నెలలో ఫాల్గుణ పౌర్ణమి, చైత్ర పౌర్ణమి నాడు మాత్రమే భక్తులకు దర్శనం కోసం అనుమతిస్తారని దీని వలన చాలామంది భక్తులు తుంబుర తీర్థంను సందర్శించ లేకపోతున్నారని తెలిపారు. తర్వాత రోజుల్లో కూడా మిగిలిన భక్తులకు దర్శించుకునే అవకాశం కల్పించడం కోసం, తుంబుర తీర్థం రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఉండడం వలన సాధారణ భక్తులకు, సాధారణ రోజులలో తీర్థంకు వెళ్ళడానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాధ్యాసాధ్యాలను అటవీశాఖ అధికారులతో వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు.



రైతులైనా పైసలివ్వాల్సిందే!



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అక్రమార్కులకో రూలు.. రైతులకో రూలు అన్న చందంగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. స్వర్ణముఖి నది నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలిపోతున్నా పట్టించుకోని పోలీసులు..రైతులు తమ పొలాల్లోకి బాట వేసుకునేందుకు మట్టిని తరలిస్తే ఆంక్షలు పెడుతున్నారు. తొట్టంబేడు మండలంలోని చియ్యవరం, చేమూరు గ్రామాల రైతులు పొలాల మధ్య ఉమ్మడిగా నిర్మించుకుంటున్న రోడ్డు పనులను ఆదివారం పోలీసులు అడ్డుకోవడమే ఇందుకు ఉదాహరణ. పైగా రోడ్డు నిర్మాణం సజావుగా జరగాలంటే పైసలివ్వాలన్న డిమాండ్ పెట్టినట్లు రైతులు ఆరోపించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్డును తమ సొంత ఖర్చులతో బాగు చేసుకుంటుంటే పోలీసులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని రైతులు విమర్శిస్తున్నారు. ఈ వివాదానికి సంబంధించిన దృశ్యాలు ఆదివారం సోషల్ మీడియాలో వైరలయ్యాయి.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ వారి సహకారంతో ఉచిత నేత్ర చికిత్స శిబిరం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు పురుషులు 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో కంటి ఆపరేషన్ల కొరకు 34 మందిని ఎంపిక చేసినట్లు డాక్టర్ మురళి తెలిపారు. వీరిని ప్రత్యేక బస్సులోచెన్నై శంకర్ నేత్రాలయం తీసుకువెళ్లి ఆపరేషన్ చేయించి తిరిగి వారి స్వస్థలాలకు పంపడం జరుగుతుందన్నారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు ఎం.ప్రభాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



46వ రోజూ నిరసన దీక్షలు



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: రామారావుని బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 46వ రోజుకు చేరాయి. ఈసందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ రామారావుని వెంకటగిరి నుండి బదిలీ చేసేంతవరకు కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు వెంకటగిరి మండల జాయింట్ సెక్రెటరీ చిరంజీవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాజయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు పెంచలయ్య, సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, రమణయ్య, మాధురి, శుభ రత్నమ్మ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా ప్రథమ జిల్లా మహా సభను చిత్తూరులోని విజయం కాలేజీ ఆవరణంలో విజయవంతంగా జిల్లా కన్వీనర్ సుదర్శనం నాయుడు అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, జై భారత్ జాతీయ కార్యదర్శి, ఐక్య వేదిక కోర్ కమిటీ సభ్యులు లోకనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల రహీమ్, ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి నెల్లూరు శివ పార్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గంను సభ్యుల ఆమోదంతో ఎన్నుకోవడం జరిగింది. చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా రాజేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పర్వేజ్, జిల్లా కోశాధికారిగా బాబు నాయుడును ఎన్నిక చేసుకోవడం జరిగింది.

దాడులను తిప్పికొడతాం..

చిత్తూరు నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ విజయానందరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అధికారమదంతో దాడులు చేస్తే, ప్రతిదాడులు చేసి తిప్పికొడతామని చిత్తూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎంసి విజయానందరెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక తోటపాల్యంలో 40, 41 డివిజన్లకు సంబంధించి బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 40 వ డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శరవణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు దాదాపు 140కి పైగా అలవిగాని హామీలను గుప్పించి గదినెక్కిన కూటమి సర్కార్, వాటిలో కనీసం నాలుగు కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం దారుణమన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదు..: ఎంపిపి రెడ్డప్ప

ప్రజాశక్తి-పెద్దపంజాణి: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు తాను ఎప్పుడూ పాల్పడలేదని ఎంపీపీ రెడ్డప్ప ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఆయనను వైఎస్సార్‌సీపీ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుడనే చిన్నచూపు తోనే తనను పార్టీ నుండి సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను వైసీపీకి వ్యతిరేక కార్యకలాపాలు, కార్యక్రమాలలో గాని పాల్గొనలేదని, తాను అనారోగ్య కారణంగా వైద్యుల సలహా మేరకు కొంతకాలం విశ్రాంతి తీసుకుంటున్నానని, కొందరు తనపై ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్య చేపట్టే తప్పుడు ఫిర్యాదులతో పార్టీ నుండి బహిష్కరించే వరకు తీసుకొచ్చారని తెలిపారు. అధిష్టానం తనకు ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా పార్టీ నుండి బహిష్కరించడం ఊహించలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

సమస్యలతో సతమతం!

- సౌకర్యం లేని పాఠశాలకు తరగతులు మార్పు
- ముందుకు సాగని చదువులు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణల్లో భాగంగా సౌకర్యం లేని పాఠశాలకు తరగతులను మార్చివేశారు. ఈ కారణంగా విద్యార్థుల చదువులు చతికిలపడ్డాయి. విద్యలో మంచి ఫలితాలు సాధించాలన్న ప్రభుత్వ నిర్ణయం ఏమిటో కాని తమ పిల్లలకు అవి భారంగా మారి హాయిగా ముందుకు సాగుతున్న చదువులు చతికిల పడేలా చేశాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలతో సతమతం

వెదురుకుప్పం మండలంలోని యనమల మంద గ్రామంలో 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు పాఠశాల వుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో తీసుకున్న మార్పులలో భాగంగా 5వ తరగతి వరకు పాఠశాలను కుదిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆరు నుండి ఎనిమిదో తరగతి వరకు వున్న విద్యార్థులు ఐదు కిలో మీటర్లు మేర ఉన్న ఆల్లమడుగు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు వెళ్లి చదవాల్సిన దుస్థితి ఏర్పడింది.

సౌకర్యం లేని పాఠశాలకు తరగతులు మార్పు

ఆల్లమడుగు పాఠశాలకు వెళ్లటానికి ఎలాంటి రవాణా సౌకర్యం లేదు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో పిల్లలను పాఠశాలకు పంపడానికి తల్లిదండ్రులు సంకోచిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆనందంగా సాగుతున్న తమ పిల్లల చదువులను ప్రభుత్వ నిర్ణయం చతికిల పడేలా చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరగతులు యథాతథంగా కొనసాగించాలి

తమ పాఠశాల యనమలమందలోనే ఎనిమిదవ తరగతి వరకు యథాతథంగా కొనసాగించాలని విద్యార్థులు 50 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే థామస్, కలెక్టర్ సుమిత్ కుమార్, రాష్ట్ర మాల కార్పొరేషన్ ఫైనాన్స్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు (ఫైల్ ఫొటో)

పొన్న దృష్టికి సమస్యను విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకెళ్లారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా తమ పిల్లలను పాఠశాలకు పంపకుండా నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - దొరవారిసత్రం : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందగా ఒకరు గాయపడిన సంఘటన మండల పరిధిలోని అక్కరపాక జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. నాయుడుపేట మండలం, పూదురుకు చెందిన యాళ్లంపటి భాను ప్రసాద్ (20), గణేష్ (20) (ఇంజినీరింగ్ విద్యార్థులు), అనిల్ అనే ముగ్గురు యువకులు మోటారు సైకిల్‌పై వరదయపాలెం వద్ద వున్న వాటర్ పాల్స్‌కు వెళుతుండగా అక్కరపాక వద్ద, ముందు వెళు తున్న కంటైనర్ లారీ ఢీకొనడంతో భాను ప్రసాద్, గణేష్‌లు అక్కడికక్కడికే మృతి చెందారు. దీంతో అనిల్ తీవ్రంగా గాయ పడ్డాడు. ఎస్ఐ అజయ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ యువకుడిని నారాయణ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి కడప జిల్లా ఖాజీపేట సమీపంలో ఒక ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేసి, 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బృందం స్థానిక ఎఫ్‌బివో లింగానాయక్‌తో కలిసి శనివారం రాత్రి నుండి ఖాజీపేట అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారని అధికారులు తెలిపారు. పత్తూరు సమాధులు చేరుకునే సమయానికి ఒక కారులో కొంత మంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారని, వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయడంతో వారుపారి పోయారన్నారు. వారిని టాస్క్ ఫోర్సు పోలీసులు వెంబడించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారన్నారు. పట్టుబడ్డ వ్యక్తి తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించా మన్నారు. దీనిపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -బంగారు పాళ్యం: కడుపు నొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలోని తుంబపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తుంబపాల్యం గ్రామానికి చెందిన మార్కొండయ్య కుమారుడు పవన్ కళ్యాణ్ (28) కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి పొలంలో పడి ఉండడం గమనించి కుటుంబ సభ్యులు అతడిని బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత సిఎంసికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. యువకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, చిత్తూరు జిల్లా కుప్పం మండలం వి.కోటకు చెందిన సాయి తేజ (21) స్థానికంగా ఉండే ఓ ప్రైవేట్ కాలేజీలో విద్యను అభ్యసిస్తున్నాడు. వ్యక్తిగత పనిమీద ద్విచక్ర వాహనంపై తిరుపతి వైపు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయి తేజ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో చంద్రగిరి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'గో సంరక్షణ'కు రూ . 51 వేలు విరాళం

ప్రజాశక్తి-చౌడేపల్లి: శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం ఆధ్వర్యంలో నడుస్తున్న గో సంరక్షణ పథకానికి దాత రూ.51 వేలను విరాళంగా అందించారు. ఈ మేరకు ఆదివారం ఆలయంలో ఈవో ఉప కమిషనర్ ఏకాంబరానికి దాతలు కృష్ణగిరికి చెందిన అరుణ్ కుమార్, మౌనికలు నగదును అందించారు. వీరికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికార , అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రైల్వే స్టేషన్ పరిధిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే జీఆర్ పోలీసుల కథనం మేరకు.. సైదాపురం మండలం తూర్పుపూండ్ల గ్రామానికి చెందిన పొట్టేళ్ల రాజ్ కుమార్(26) గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్లోని ఒకటో నంబరు ప్లాట్ ఫామ్ నుండి చెన్నైకు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రెలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి, రైల్వేజీఆర్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నారు.

మద్యానికి బానిసై యువకుడు మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మద్యానికి బానిసైన ఓ యువకుడు డీ హైడ్రేషన్‌కు గురై మృతి చెందిన సంఘటన పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ గోపీ కథనం మేరకు.. స్థానిక ప్రాజెక్టు వీధికి చెందిన మురళి(25) పట్టణం లోని ఓ హోటల్లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యం, చెడు అలవాట్లకు బానిసయ్యాడు. రెండు రోజులుగా జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపం లో మద్యం తాగి పడి ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు లో అభ్యంతరాలు లేకపోవ డంతో మృత దేహాన్ని అప్పగించినట్లు సీఐ తెలిపారు.



బోరు నీరు వృథా

వీధి అంతా బురదమయం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని గౌనితిమ్మేపల్లి గ్రామంలోని పురవీధిలో చెరువులను తలపిస్తోంది. ఈ వీధిలో బోరు నీరు లీకై ప్రవహిస్తుండడంతో వీధి మొత్తం అధిక నీరు ప్రవహించి బురదమయం అవుతోంది. దీంతో చిన్నపిల్లలకు, గ్రామస్తులకు అక్కడ ప్రయాణించాలన్నా ప్రమాదకరంగా మారిందని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు సైకిల్ తొక్కినా నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యను మండల అధికారుల దృష్టికి, పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు . ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టి గ్రామంలో డ్రైనేజీలు క్లీనింగ్ చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.



వీధిలో నీరు చేరి బురదమయమైన దృశ్యం

ఉమ్మడి జిల్లా చెస్ పోటీలు ప్రారంభం



ప్రజాశక్తి -విజయపురం(నగరి) : స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వీకేఆర్ పురం గ్రాండ్ వరల్డ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాల నుంచి జూనియర్ విభాగంలో 180 మంది, సీనియర్ విభాగంలో 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సీఐ విక్రమ్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఈ క్రీడతో జ్ఞాపక శక్తి, విజ్ఞానం బాగా పెరుగుతా యన్నా రు. తిరుపతి మెడికల్ కళాశా ల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు వృద్ధులు చెస్ ఆడితే ఆల్జీమర్ వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. మెదడును ఈ ఆట మెరుగుపరుస్తుందన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ఈ హెచ్ ప్రభాకర్ రాజు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ ఫైనల్స్ వుంటుందని అదే రోజు విజేతలకు బహుమతులు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చెస్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజి, ప్రతినిధి నవీన్‌కుమార్, నగరి లయన్స్ క్లబ్ అధ్యక్షులు గజేంద్ర, కార్యదర్శి మోహన్, కోశాధికారి శక్తివేలు, సర్వీసు కమిటీ ఛైర్‌పర్సన్ రవిబాబు, నగరి చెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఖలీల్ బాషా, సత్యానంద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి -కార్వేటినగరం : ఎస్‌టియు రాష్ట్ర నాయకుడు, ఉపాధ్యాయులు ఢంకా హమీద్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఆదివారం సన్మానించారు. ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ , మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్వేటినగరానికి తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. ఇక్కడ నివసిస్తున్న హిందూ ముస్లిం ప్రజలు కలిసిమెలిసి జీవించడం , కళ్యాణ మండపం కి హిందూ ముస్లిం పేరు పెట్టి శుభకార్యాలు నిర్వహించడాన్ని చూస్తే హిందూ ముస్లిం ఐక్యత కి ప్రతీక కార్వేటినగరం అని అన్నారు. దేశంలో ఎప్పుడూ మతాల మధ్య గొడవలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుతున్న మోడీ ఒకసారి కార్వేటినగరానికి వచ్చి హిందూ ముస్లిం లని చూస్తే అప్పుడైనా జ్ఞానోదయం అవుతుందన్నారు. హమీద్ శేష జీవితాన్ని సమాజ సేవకి ఉపయోగించాలన్నారు. అనంతరం హమీద్ కుటుంబాన్ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి హేమచంద్రరెడ్డి పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR

I.P.No. 11 of 2024

Between:-
P.Sai Dileep ...Petitioner
And:-
D.Bobby and others ...Respondents

NOTICE TO R8 TO R11

To
R8. C.Hemachandra, S/o not known, Kanipakam patnam village, Irala Mandal, Chittoor District.
R9. Palle Pruthvi Rao, S/o not known, residing at opp. Vignana Deepthi School, Chittoor town and District,
R10. Sarath, S/o not known, Santhapet, Chittoor town and District,
R11. Parthasarathi, S/o not known, Bommasandra, Bangalore,Karnataka.
Sirs,

Please take notices that the above IP filed by the petitioner for declaring him as Insolvent stands posted to **28-08-2025** for your appearance. Therefore, please be present either by person or through your advocate before the above court by **10-30 A.M. on 28-08-2025** and file your counter if any in the above matter without fail, otherwise, the above matter will be decided ex-parte.

Sd/- **U.SESHADRI NAIDU**
Advocate for Petitioner
Place: Chittoor Date: 02-08-2025

మహా రాజ రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో శ్రీకాళహస్తి

O.S. No. 484/2022

పైడిముద్దల లలిత ...పిటీషనర్

V/s

1. కొమ్మిందల సుశీల, 2. కొమ్మిందల రమేష్
...రెస్పాండెంటు నెం. 1 & 2

నోటీసు

పై దావా నందు పైన తెలిపిన పిటిషనర్ రెస్పాండెంట్ నెం. 1 మరియు 2 వారిపై పై దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావా 07-08-2025 నకు వాయిదా ఉన్నది. కావున ఈ క్రింది తెలిపిన నెం. 1 మరియు 2 వార్లు సదరు తేదీన ఉదయం గం. 10.30 ని. లకు స్వయముగా గానీ వకీలు ద్వారా గానీ సదరు కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

రెస్పాండెంట్లు

1. కొమ్మిందల సుశీల, W/o లేట్ వెంకటేశులు, ఆజాద్ గాలి, నియర్ వీరేంద్ర ప్రొవిజన్ స్టోర్, సమర్థ నగర్, చున్న భట్టి, సిఒన్, ముంబై, మహారాష్ట్ర,
2. కొమ్మిందల నరేష్, S/o లేట్ వెంకటేశులు, ఆజాద్ గాలి, నియర్ వీరేంద్ర ప్రొవిజన్ స్టోర్, సమర్థ నగర్, చున్న భట్టి, సిఒన్, ముంబై, మహారాష్ట్ర,

యస్. గౌస్ బాషా
న్యాయవాది, శ్రీకాళహస్తి

నేడు మంత్రి పర్యటన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: కార్వేటినగరం మండలంలో రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ సోమవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని కార్వేటినగరం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యం చంగల్రాయయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి రాజేంద్ర రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. కార్వేటినగరం మండలం కేశవ కుప్పం గ్రామపంచాయతీ పసలవాని మిట్టలిలో ఓ కార్యక్రమం, ఈడిగపల్లిలో గ్రామ ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవంలో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వియం థామస్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.



పిచ్చి మొక్కలు తొలగించండి

వాహన చోదకుల వినతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రహదారిలో పిచ్చి మొక్కలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. బంగారుపాలెం మండలం కేంద్రం నుండి అరగొండ వెళ్లే దారిలో పెద్ద డ్యాం వద్ద రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు మొలిసి పెద్ద డ్యాం కనబడని స్థితిలో వుందని వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదానికి గురయ్యే పరిస్థితి వుందని వాపోతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే సూచిక బోర్డు ఏర్పాటు చేసి డ్యాం ఇరుపక్కల వున్న పిచ్చి మొక్కలు తొలగించాలని వాహనదారులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సూచిక బోర్డులు, పిచ్చి మొక్కలు తొలగించాలని కోరుతున్నారు.



జెడ్పీ నిధులతో నూతన బోరు: జెడ్‌పీటీసీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: జెడ్పీ నిధులతో నూతన బోరు ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్‌పీటీసీ సోమశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రాగి మాను పెంట రోడ్డుపై వున్న అంబేద్కర్ భవనం వద్ద నాలుగున్నర లక్షల రూపాయలతో నూతన బోరుకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అంబేద్కర్ భవనానికి స్థలాలు కేటాయించాలని గత ఎంపీ నిధులతో భవన నిర్మాణం చేపట్టారని ప్రస్తుతం జెడ్పీ నిధులతో నూతన బోరును మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, అంబేద్కర్, యువజన సంఘ సభ్యులు సుబ్రహ్మణ్యం , జగదీష్, నవీన్, దేవా పలువురు అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల్లో ఆనందం: టిడిపి

ప్రజాశక్తి - తవణంపల్లి:

సూపర్ సిక్స్ అమలులో భాగంగా రైతులకు అన్నదాత సుఖీభవ తొలి విడత 7వేల రూపాయలు రైతులు ఖాతాలో జమ చేయడంతో రైతులు ఆనందంగా వున్నారని రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. జొన్న కురుకుల గ్రామంలో ఆయన రైతులతో కలిసి సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తవణంపల్లి మండలం జొన్న గురుకుల సచివాలయం పరిధిలో దాదాపు 300 మందికి పైగా రైతులు ఖాతాలో నగదు జమ అయిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్‌సి మధు కుమార్, రైతు కార్యదర్శి జైపాల్, పార్లమెంట్ మైనారిటీ కార్యదర్శి షబ్బీర్ బాషా, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గిరిబాబు , టిడిపి బీసీ సెల్ నాయకుడు రామచంద్ర, కిరణ్ కుమార్ , జనసేన నాయకులు అరగొండ మోహన్ బాబు, వెంకటేశ్వర్లు,(చిన్న) దొమ్మరపల్లి కార్తీక్, వంకమిట్ట బాబు, పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి -కార్వేటినగరం :

రాష్ట్ర ఎస్‌టియు నాయకుడు గాజుల నాగేశ్వరరావుకు ఇటీవల బాలయ్య పల్లి మండల విద్యాశాఖ అధికారి 1గా ఉద్యోగ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఉపాధ్యాయులు హెచ్ఎం మర్రి శేఖర్ ఉపాధ్యాయులు మురహరి,పయణి రెడ్డి, చిరంజీవి వెంకటేష్ గోపీనాథ్ దేవయ్య లు శాలువాలు కప్పి సత్కరించారు. తిరుపతి జిల్లా హెచ్ఎంలు యూనియన్ సంఘం అధ్యక్షులు కే వేణుగోపాల్ రెడ్డిని ఉపాధ్యాయుడుని సత్కరించారు.

ఆస్పత్రి వున్నా మెరుగైన వసతులేవి?

ప్రజాశక్తి -వెదురుకుప్పం: జనాభాకు తగిన విధంగా వెదురుకుప్పం మండలంలో ప్రభుత్వ ఆస్పత్రులు లేవు..వున్న ఆస్పత్రిలో మెరుగైన వసతులు లేవు..రైతులు ఎవరైనా పాముకాటుకు గురైనా వైద్యం అందే పరిస్థితి లేదు..గర్భిణులకూ వైద్యం అందని పరిస్థితి ఏర్పడింది.. ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు వెంటనే ప్రాథమిక వైద్యం అందించాలన్నా తగిన వైద్య పరికరాలు లేవు.. 30 కిలోమీటర్ల దూరంలోని పుత్తూరుకో, తిరుపతికో వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది..ఈ సమస్యలను నేడు కార్వేటినగరం మండలానికి రానున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలుసుకుని పరిష్కరించాలని మండల వాసులు కోరుతున్నారు.

జిడి నెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం మండలం ఎటు కాని పరిస్థితిలో వుంది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి నేడు నియోజక వర్గానికి రానున్న నేపథ్యంలో జిల్లాలోని నియోజకవర్గం దశ తిరుగు తుందని స్థానికులు అంటున్నారు. అయితే జిల్లాలోని వెనుకబడిన ప్రాంతంగా గంగాధర నెల్లూరు నియోజక వర్గం వుందని, ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబుకి తెలుసునని నియోజకవర్గ మేధావులు పేర్కొం టున్నారు.

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో పెనుమూరు, వెదురుకుప్పం, కార్వేటినగరం, శ్రీ రంగరాజుపురం, గంగాధర నెల్లూరు, పాల సముద్రం మండలాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి వియం థామస్ గెలిచారు. 15 సంవత్సరాల తర్వాత గంగాధర నెల్లూరులో టిడిపి విజయం సాధించింది. ఎమ్మెల్యే మంచి విద్యా వంతుడు.. నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు నడిపి స్తారని నియోజకవర్గ వాసులు విశ్వసిస్తున్నారు. అయితే వెదురుకుప్పం మండలంలో పలు సమస్యలు తిష్ట వేశాయని నేడు మంత్రి పర్యటన సందర్భంగా నైనా ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారేమోనని స్థానికులు ఆశిస్తున్నారు.

వెదురుకుప్పంలో సమస్యలు

– ఈ మండలంలో ఎక్కువ భాగం వ్యవసాయం రైతులు ఉన్నారు. జీవనం సాగిస్తు న్నారు. రైతులు ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై పరిస్థితి విషమిస్తే ఇటు పక్క జిల్లా అయిన తిరుపతికి, పుత్తూరు కి వెళ్లాల్సిందే. ఎటు వెళ్లాలన్న 30 కిలోమీటర్ల దూరం వుంది.

– గర్భిణుల పరిస్థితి కూడా ఇలాగే వుంది. ఉన్న ఆస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు లేవు..

– మండలం నుంచి ఇటు చిత్తూరు, తిరుపతి, పుత్తూరుకి వెళ్లాలంటే రోడ్డు సదుపాయం సరిగా లేదు. నాలుగు వైపులా సింగిల్ రోడ్లే వున్నాయి.. వాటిలోనూ అక్కడక్కడా గుంతలు వున్నాయి.

– పాడి రైతులకు పశువుల ఆస్పత్రులు ఉన్నా ఏదైనా పాడి ఆవుకు ఇబ్బంది వస్తే… తరలించేటందుకు పశువైద్య ప్రభుత్వ వాహనాలు అందుబాటులో ఉండవు.. ఇలా పాడి ఆవులు చనిపోయిన సంఘటనలు చాలా ఉన్నాయి.

– ప్రమాదవశాత్తు ఏదైనా రోడ్డు ప్రమాదంలో క్షతగ్రాతులకు తీవ్ర గాయాలు అయితే తిరుపతికి, చిత్తూరుకి తరలించేందుకు 108 వాహనాలు అందు బాటులో ఉండవు. వున్నా అవి సరైన కండీషన్‌లో లేవు.

– వెదురు కుప్పంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రెండు ఆసుపత్రులు ఇక్కడ అవసరమని మండల వసులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా స్పందన లేదు.

– ఈ మండలంలో 50,000 మంది పైనే జనాభా వున్నారు. సదుపాయాలు తక్కువగా ఉన్నాయి.

ఈ సమస్యలు నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రికి వివరించి పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- రైతులు పాము కాటుకు గురైనా వైద్యం లేదు..
- రైతులు పాము కాటుకు గురైనా వైద్యం లేదు..
- గర్భిణుల వైద్యం పరిస్థితీ అంతే..
- ప్రమాదాలకు గురైన క్షతగాత్రులనూ 30 కిలోమీటర్ల దూరం తీసుకెళ్లాల్సిందే..
- సమస్యల పరిష్కారంపై మంత్రి దృష్టి సారించాలి


మంచి వైద్యం అందించాలి



ప్రజలకు మంచి వైద్యం అందించాలి.. మండల వాసుల్లో ఎక్కువ భాగం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ప్రభుత్వం మంచి వైద్య సేవలు అందించాలి. అవగాహన కల్పించాలి. సచివాలయ పరిధిలో ఉన్న విలేజ్ క్లినిక్‌ను అభివృద్ధి చేసి వాటి ద్వారా గ్రామీణ ప్రాంతాల వాసులకు వైద్య సేవలు అందించాలి

- సువ్వల ఆనంద రెడ్డి, పచ్చికాపల్లం, వెదురుకుప్పం మండలం.

రెండు ఆస్పత్రులు ఏర్పాటు చేయాలి



మండలంలో ప్రస్తుతం ఒక ఆసుపత్రి వుంది. జనాభా ఎక్కువగా వుంది. ప్రభుత్వం గుర్తించి అవసరమైన చోట రెండు ఆస్పత్రులు ఏర్పాటు చేసి డాక్టరును నియమించి ప్రజలకు వైద్య సేవలు అందించాలి..

- అత్తూరు ప్రభాకర్, సద్ది కూళ్లపల్లి, వెదురుకుప్పం మండలం.

వికోట కవులకు సిరివెన్నెల జాతీయ పురస్కారం



సిరివెన్నెల జాతీయ పురస్కారాలు అందుకున్న వికోట కవులు

ప్రజాశక్తి - వికోట : భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, దక్షిణ భారత దేశం, ఎంవీ కేశవరెడ్డి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పద్మశ్రీ డాక్టర్ సిరి వెన్నెల సీతారామ శాస్త్రి సాహితీ వైభవంపై కవితా గానం ఆలపించిన వికోటకు చెందిన ముగ్గురు కవులకు జాతీయ పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా కొందరు ప్రముఖు లు మాట్లాడుతూ తెలుగు పాటల సాహిత్యంలో ఎన్నో మంచి సాహిత్య రచనలతో, మనసునకు హత్తుకునే విధంగా సీతారామ శాస్త్రి రచనల సాహితీ సంపద కలకాలం తెలుగువారి గుండెల్లో దాగి వుంటుందన్నారు. చిత్తూరు స్థానిక రెడ్డిభవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వి కోట కవులు, కవయిత్రి డాక్టర్ కవికోకిల కొరారి వెంకటరత్నం, డాక్టర్ జి శాంత కుమారి, డాక్టర్ రఘుపతిలను నిర్వాహ కులు ఘనంగా సన్మానించి సిరివెన్నెల జాతీయ పురస్కారం 2025 షీల్డ్, ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మద్రిపూడి దేవేంద్రరావు, డాక్టర్ సి నారాయణ స్వామి, వికోటకు చెందిన విద్యా సంస్థల అధినేత డాక్టర్ దామోదర్ రెడ్డి, మైసూరు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చక్రపాణితో పాటు రాష్ట్రం నలుమూలల నుండి కవులు, కవయిత్రు లు పాల్గొన్నారు.



నాల్గవ తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎన్జీవో హోంలో తాలూకా పరిధిలోని నాల్గవ తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం ఆదివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా తాలూకా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించి నాల్గవ తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పిబి బాల సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. గౌరవాధ్యక్షులుగా సాంబయ్య, కార్యదర్శిగా పి రవి, కోశాధికారిగా జి రఘు, ఉపాధ్యక్షులుగా డి అనిత, పి పురుషోత్తం, సంయుక్త కార్యదర్శిగా హరీష్, ప్రచార కార్యదర్శి గా గురుమూర్తి ఎన్ని కయ్యారు. ఎన్నికైన కార్య వర్గాన్ని పూలమాలలతో సత్కరించి అభినందిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎన్జీవో సంఘ అధ్యక్షు డు ఆనందబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన సమస్య లైన పిఆర్‌సి, ఐఆర్, డిఎ, సరెండర్ లీవ్ తదితర సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. గుడియాత్తం రోడ్‌లో మైన్స్ కార్యాలయం పక్కన ఉన్న సంఘం ఖాళీ స్థలంలో సంఘం కార్యాలయ భవనం నిర్మాణానికి తీర్మానం చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మునిక్రిష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాసులు, జిల్లా గౌరవాధ్యక్షుడు పి హరికృష్ణ, ఎన్జీవో మేనేజర్ నారాయణ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

వీరాంజనేయ ఆలయంలో శ్రీజ దంపతులు

ప్రజాశక్తి-తవణంపల్లి:

అరగొండ అర్దగిరి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం బంధువులు డాక్టర్ శ్రీజ దంపతులు కుటుంబ సమేతంగా స్వామిని ఆదివారం దర్శించుకున్నారు. వారికి శ్రీ అర్దగిరి వీరాంజనేయ స్వామి ఆలయ సంప్రదాయ పద్ధతిలో తీర్థ ప్రసా దాలు అందించారు. ఈ కార్యక్రమంలో అర్ధగిరి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు లక్షల పుస్తకాల పంపిణీ పూర్తి

ఉపాధ్యాయ దంపతులు తులసినాథం నాయుడు, పుష్ప ఘనత



తులసీనాథం నాయుడు



పుష్ప

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండల పరిధిలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయ దంపతులు పైనేని తులసినాథం నాయుడు, పుష్ప రెండు లక్షల పుస్తకాలను రెండు రాష్ట్రాల పరిధిలో విద్యార్థులకు ఉచితంగా పంచిపెట్టారు. 2017 వ సంవత్సరం నుండి విడతల వారీగా తాను స్వయంగా కూర్చిన నీతి పద్యాలు పుస్తకాలు ఒక లక్షా 50 వేలు ముద్రించి పంచిపెట్టారు. ఇవి కాకుండా పెద్ద బాలశిక్ష పుస్తకాలు ఐదువేలు, పాఠశాల ప్రార్థన కోసం తాను కూర్చి ముద్రించిన జ్ఞాన దీపాలు , పుస్తకాలు 3వేలు పంచి పెట్టారు. బొమ్మల భారతం, బొమ్మల రామాయణం, బొమ్మల భాగవతం, బొమ్మల పంచతంత్ర కథలు, హరికిషన్ కథలు, సినబ్బ కథలు, తెనాలి రామకృష్ణ కథలు, అక్బర్ బీర్బల్ కథలు, చందమామ కథలు, నసీరుద్దీన్ కథలు, తెలుగు వ్యాకరణము, వ్యాసాలు, దేశ నాయకుల జీవిత చరిత్రలు, వివిధ శతకాలు, తాను రచించిన తులసాకులు, తులసి రసాలు తులసి పుష్పాలు, రచయితలు- శాస్త్రవేత్తలు, మొదలైన పుస్తకాలు 40 వేలకు పైగా సొంత నిధులతో కొని పంచిపెట్టారు. జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్‌తో కలిసి 200 పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలను అందించారు. ఇవన్నీ కలిసి రెండు లక్షల పంపిణీ మైలురాయిని దాటడం పట్ల పలువురు హర్షం ప్రకటించి తులసినాథం నాయుడు దంపతులను అభినందించారు.

12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:12వ వేతన సవరణ సంగాన్ని ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. స్థానిక ప్రజ్ఞ కోచింగ్ సెంటర్‌లో ఆ సంఘం తిరుపతి జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎన్. రమేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, ఐపీఎల్ పాటర్న్ కే.సుబ్బారెడ్డి హాజరయ్యారు. చిరంజీవి మాట్లాడుతూ 12వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసి, 30% మధ్యంతర భృతి విడుదల చేయాలని, పెండింగ్‌లోఉన్న 3 డిఏలను విడుదల చేయాలని కోరారు. అఖిలభారత విద్యా సంఘాల చీఫ్ పాట్రన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులు చదువు చెప్పే అవకాశం కల్పించమని ఫ్యాప్టో డిమాండ్ చేసే స్థితికి ప్రభుత్వం వచ్చిందంటే పరిస్థితి అర్థం అవుతుందన్నారు. రాష్ట్ర అదనపు కార్యదర్శి జి చంగల్రాయ మందడి మాట్లాడుతూ రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ, పిఎఫ్ బకాయిలు విడుదల చేయాలని, అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్.సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



తుడ ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డితో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదివారం తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా బిజెపి, తెలుగుదేశం పార్టీ నాయకులతో భోజన సమయంలో మాటమంతి కలిపారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సానుకూలంగా ఉన్నారని, వారి నమ్మకాన్ని కొనసాగిస్తూ క్షేత్రస్థాయిలో నాయకులకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని మంత్రి సూచించారు. సీఎం, డిప్యూటి సిఎం, లోకేష్‌లు రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకులు కష్టపడుతున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ సత్య కుమార్ యాదవ్ మంత్రి అయ్యాక కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపరచడం, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి కృషి చేస్తున్నారని కొనియాడారు.

టీచర్స్ క్రికెట్ లీగ్ సన్నాహక సమావేశం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 6వ టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ సన్నాహక సమావేశం ఆదివారం శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. తిరుపతి, నెల్లూరు జిల్లాల నుండి 20 మండలాల జట్ల బాధ్యులు పాల్గొన్నారు. ఈనెల 31, సెప్టెంబర్1,2,3 తేదీలలో నిర్వహించు టోర్నమెంట్‌కు సంబంధించిన విధివిధానాలను చర్చించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ 6 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న టీచర్స్ క్రికెట్ లీగ్ ఈ సంవత్సరం కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.డి కరీముల్లా ఖాన్, మురళి సింగ్, షేక్ బాబర్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సీనియర్ క్రీడాకారులు ముని భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట పంచాయతీ, క్రాంతి వీధిలో రు.26 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆదివారం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో అభివృద్ధి పరుగులెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు దామోదర్, మాజీ అధ్యక్షుడు జానా వెంకటయ్య, ధనంజయలు నాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



శ్రీ స్వామి హథీరాం బావాజీ మఠం

మండువా కూల్చివేతపై రాజకీయ నీలినీడలు

- ప్రమాదం అని నిర్ధారణ అయినా రాజకీయ జోక్యం
- మఠం భవనంపై తిరుపతి ఐఐటి నివేదిక
- దుకాణదారులకు నోటీసులు జారీ చేసిన ఏవో





ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):తిరుమల శ్రీవారికి పరమ భక్తుడైన శ్రీ స్వామి హథీరాం బావాజీపై ఉన్న భక్తితో వేలాదిమంది భక్తులు దానమిచ్చిన భూమితో, కానుకలతో దేశంలోనే ఎక్కువ భూములు కలిగిన మఠంగా శ్రీ స్వామి హథీరాం బావాజీ మఠం ప్రాచుర్యం పొందింది. వందేళ్ళ పైబడిన తిరుపతి గాంధీ రోడ్డు లోని శ్రీ స్వామి హథీరాంజీ మఠం మండువా భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదపు అంచుకు చేరింది. ఆదమరిస్తే ఆస్తి నష్టంతో పాటు, ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని ముందుగా గుర్తించిన అధికారులు ఆ మండువా భవనం, శిథిలావస్థకు చేరిన నిర్మాణంలో కొంత మీటర్ల మఠం భాగాన్ని ఆలస్యం చేయకుండా కూల్చివేసి, తిరిగి నిర్మించాలని అధికారులు అంచనా వేసినప్పటికీ, వారి నిర్ణయానికి రాజకీయ నీలి నీడలు అడ్డుతగులుతుండడంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. 2019లోనే అప్పటి నగరపాలక సంస్థ కమిషనర్ నగర పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి వాటికి సంబంధించి నోటీసులు జారీ చేసి కూల్చివేయాలని ఆదేశాలను జారీ చేశారు. ఆ జాబితాలో శ్రీ స్వామి హథీరాంజీ మఠం కూడా ఉంది. అయితే ప్రభుత్వాలు మారినా పార్టీలు మారినా, కొందరు మఠం నుండి అద్దె ప్రతిపాదికన షాపులు పొందిన వారిని అడ్డుపెట్టుకొని ప్రస్తుత స్థానిక జనసేన పార్టీ ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్లి తమ బ్రతుకులు రోడ్డున పడతాయని, మఠం అధికారులు తీసుకున్న కూల్చివేత నిర్ణయాన్ని ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వస్తున్నారు. పెను ప్రమాదం జరగబోతోంది అంటూ మఠానికి సంబంధించిన ఓ విశ్రాంత ఉద్యోగి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు నేరుగా లేఖ రాశారు. దీనిపై స్పందించిన సీఎం జిల్లా కలెక్టర్‌ను పరిశీలించి, వాస్తవిక పరిస్థితులను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు.

మఠం చుట్టూ రాజకీయ నీలి నీడలు

శ్రీ స్వామి హథీరాంజీ మఠం చుట్టూ రాజకీయ నీలి నీడలు కమ్ముకుంటున్న నేపథ్యంలో 2025 ఏప్రిల్ 1న దేవాదాయ శాఖ కమిషనర్, ప్రమాదంలో ఉన్న మఠం భవన ప్రాంతాలను కూల్చివేయాలని ఆదేశాలిచ్చారు. ఏప్రిల్ 25న మళ్లీ కూల్చివేతను స్పష్టం ఆదేశాలిచ్చారు. అయినా ఇప్పటివరకు అధికారులు ఈ నిర్ణయాన్ని అమలు చేయకుండా, రాజకీయ ఒత్తిళ్లతో వెనక్కు తగ్గుతున్నారనే విమర్శలున్నాయి. మరోవైపు ఏ ప్రమాదం జరిగినా అధికారుల నెత్తికే చుట్టుకుంటుంది గనుక ఏమి చేయాలో పాలు పోక కిమ్మనకుండా ఉన్నారు. మరోవైపు మఠం నుండి అద్దె ప్రతిపాదికన దుకాణాలు పొందిన వారు లక్షల రూపాయల అద్దె చెల్లించకుండా లోపాయికారి పనులు చేసుకుంటూ కాలాన్ని నెట్టుకొస్తున్నారు. మఠం అధికారులు ఎన్ని నోటీసులు ఇచ్చినా ఫలితం లేకుండా పోతోంది. ఈ కారణంగా మఠం నిర్వహణ ఆర్థికంగా వెనుకబడిందని కొందరి ఉద్యోగుల అంతర్మదనం.

భవనం పటిష్టతపై ఐఐటీ తిరుపతి నివేదిక

శతాబ్ద కాలానికిపైగా ఉన్న శ్రీ స్వామి హథీరాంజీ మఠం భవనం కూల్చివేత, తిరిగి మళ్లీ నిర్మాణం, రాజకీయ ఒత్తిళ్లు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు ఈ నేపథ్యంలో మఠం గోడలు, పైకప్పు, మండువా వివిధ ప్రాంతాలను వాటి పటిష్టతను నిర్ధారించుకోవడానికి మఠం అధికారులు ఇండియన్ ఇన్స్ టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) తిరుపతి వారిని సంప్రదించి రూ.1,80,000/- లక్షల రూపాయలను చెల్లించి ఇటీవల కొన్ని రోజులపాటు పటిష్టత నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఐఐటి నిపుణుల బృందం మఠం మండువా భవన ప్రాంతాన్ని 10 జోన్‌లుగా విభజించి పరీక్షల నిర్వహించారు. కొన్ని జోన్లను తప్పనిసరిగా కూల్చివేయాలని, కొన్నింటికి మరమ్మతులు సూచించిన విధంగా చేయాలని ఐఐటి డిపార్ట్మెంట్ ఆఫ్ సివిల్ అండ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ బెహరా ప్రసన్నకుమార్ కండిషన్ అసెస్‌మెంట్ నివేదికను జూలై 17న అందించారు.

అద్దె దుకాణదారులకు నోటీసులు

శ్రీ స్వామి హథీరాంజీ మఠం ద్వారా లీజు ప్రతిపాదికన దాదాపు 51 మంది (మఠం పడమర, ఉత్తర దిక్కులో ఉన్న దుకాణదారులు) కి మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డి నేతృత్వంలో దుకాణాలు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో మళ్లీ రాజకీయ రచ్చ మొదలైంది. శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఆధ్వర్యంలో దుకాణదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఐఐటి నివేదిక ఆధారంగా జరిగిన సమావేశంలో కూల్చివేత చేస్తే తాము రోడ్డున పడతామని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను తామే చేసుకుంటామని దుకాణదారులు తమ వాదనను వినిపించారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య వారికి సూచించారు.

కలెక్టర్ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం



మండువా భవనం కూల్చివేతకు సంబంధించి తిరుపతి ఐఐటి నివేదిక ఇచ్చింది. ఇప్పటికే దేవాదాయ శాఖ కమిషనర్ కూడా కూల్చివేయాలని ఆదేశాలు ఇచ్చారు. అద్దె దుకాణదారుల ప్రతిపాదనలు, కూల్చివేత అంశాలపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్ణయం మేరకు తదుపరి కార్యచరణ ప్రారంభిస్తాం.

- బాపిరెడ్డి, ఏవో, శ్రీ స్వామి హథీరాంజీ మఠం, తిరుపతి

చట్ట వ్యతిరేక శక్తులపై గట్టి నిఘా : జిల్లా ఎస్‌పి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: జిల్లాలో ఎన్ఫోర్స్మెంట్ విధులలో భాగంగా, నేర నియంత్రణ చేస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, శాంతిభద్రతల పరిరక్షణ చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పోలీసు సిబ్బందికి సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజు స్పెషల్ పార్టీ పోలీసులతో జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో గస్తీ తిరుగుతూ, రాత్రిళ్లు రోడ్లపై తిరుగుతున్న 1,260 మంది అనుమానిత వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి, కౌన్సెలింగ్ ఇవ్వడం, 845 మంది వేలిముద్రను తీసుకోవడం జరిగిందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ సుమారు 18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, జిల్లాలో ఉన్న 1,567 మంది రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. బహిరంగంగా మద్యం సేవించే వారిపై 1,476 కేసులను నమోదు చేశామని తెలిపారు. బహిరంగంగా మద్యం సేవించే 96 ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేశామని, 258మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, రోడ్లకు ఇరువైపులా రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే 1,801 మంది చిరు వ్యాపారులపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కేసులను నమోదు చేసి కోర్టులో జరిమానాలు, శిక్షలు పడేలా చేసామన్నారు. మోటారు వేహికల్ కేసులకు సంబంధించి ద్విచక్రవాహనాలు, కారులు, ఆటో లపై మొత్తం 13,489 కేసులు నమోదు చేసి జరిమానా విధించామని, జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు తమ పరిధిలో గల 2,163 సమస్యాత్మక వార్డులు/గ్రామాలను సందర్శించి, ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, చట్టాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తిరుపతి జిల్లాలో అత్యాధునికత డ్రోన్ ద్వారా 116 ఆపరేషన్లు నిర్వహించమని పేర్కొన్నారు. తిరుపతిలోని పార్కులలో 15,567 మంది వృద్ధులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. తిరుపతి జిల్లాలో 100 గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చిన్నపిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశామని తెలిపారు. 396 హోమ్ స్టేలను తనిఖీ చేశామని, జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సర్చ్ కార్యక్రమం నిర్వహించి 479 ఇండ్లను తనిఖీ, 297 వాహనములు తనిఖీ చేసి, సరైన పత్రములు లేని 62 వాహనములు సీజ్ చేసామన్నారు. అనధికారంగా వాహనములపై ఉన్న 302 పోలీస్, ప్రెస్ స్టిక్కర్లను తొలగించామని, సైబర్ క్రైమ్, లోన్ యాప్స్, హెల్మెట్ ధారణ, రహదారి భద్రత నియమాలు, కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారిపైన అయినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

విద్యాలయాల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి



ప్రజాశక్తి - క్యాంపస్ :విద్యాలయాల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి, పాఠశాలలో రాజకీయాల ప్రవేశం ఆపేసి కేవలం తల్లితండ్రులకు, ఎస్ఎంసిలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని జిఓ తీసుకోరావడాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ తీవ్రంగా ఖండించా. ఆదివారం తిరుపతి,లో దండి మార్చ్ దగ్గర విద్యార్థుల హక్కులను కాలరాసే జిఓను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిఓ కాపీలను దగ్ధం చేశారు. పాఠశాల నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించే విధానాలు ప్రోత్సహించకుండా, ఉన్న వాటిని కాలరాయడం దుర్మార్గమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలలో ప్రజాస్వామ్యం, ఎన్నికలు గురించి చదువుతామని, విద్యార్థులకు మాత్రం ప్రజాస్వామ్యం, ఎన్నికలపై అవగామన అవసరం లేదాని ప్రశ్నించారు. జీవోను రద్దుచేయకుంటే ప్రజాస్వామ్య విద్యార్థి సంఘాలను కలుపుకొని పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, వినోద్, తేజ, జిల్లా సహాయ కార్యదర్శిలు ఉమేష్, రమణ, వీరేష్, నరసన్న, గీతాంజలి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

5 నుండి 20 వరకు డిస్ట్రిక్ అండ్ జోనల్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:ఆగష్టు 5 నుండి 20 వరకు తిరుపతిలో డిస్ట్రిక్ట్ అండ్ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహణ జరగనున్నదని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ఈ నెల తిరుపతిలో జరగనున్న డిస్ట్రిక్ట్, జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహణ, ఏర్పాట్లపై నగరపాలక కమీషనర్ మౌర్యతో కలసి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 29 న జాతీయ స్పోర్ట్స్ డేను పురస్కరించుకోవడంలో భాగంగా స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం జరుగుతుందని, సంబంధిత అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో వివిధ జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొననున్నారని వీరికి ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్ , వాలీబాల్, బాస్కెట్బాల్, హాకీ, కబడ్డీ, కోకో, షటిల్ స్పోర్ట్స్‌లో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటగా 5 నుండి 10 వరకు డిస్ట్రిక్ట్ లెవెల్, 11 నుండి 15 వరకు జోనల్ లెవెల్, 16 నుండి 20 వరకు స్టేట్ లెవెల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. క్రీడల నిర్వహణకు సంబంధించి టీటీడీ, యస్వీయు, తిరుపతి నగరపాలక సంస్థ సమన్వయంతో పనిచేయాలన్నారు. డిఎస్‌డిఒ జిల్లాలోని పి.ఈ.టిలను క్రీడల నిర్వహణకు వినియోగించుకోవాలని, క్రీడాకారులకు భోజన, తాగు నీరు సదుపాయం కల్పించాలని తెలిపారు. డిఎం అండ్ హెచ్ ఓ క్రీడాకారులకు క్రీడా మైదానాల వద్ద అవసరమైన వైద్య సదుపాయం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌కు జిల్లా విద్యా శాఖ అధికారి, డి.ఎస్.డి.ఓ, టిటిడి, యూనివర్సిటీ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టిడిపి నేత పోట్లపూడి రాజేష్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-నాయుడుపేట:టీడీపీ యువనేత నాయుడుపేట, ఎస్‌జె జువెలరీస్ అధినేత పోట్లపూడి రాజేష్ జన్మదిన వేడుకలు ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోట్లపూడి రాజేష్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పలువురు వ్యాపారులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు రాజేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. సేవా కార్యక్రమాల్లో చురుకగా ఉండే ఆయన రాజకీయాల్లో ఉన్నత స్థానానికి ఎదిగి ఇంకా ఎంతోమందికి సేవలు అందించాలని ఆయన అభిమానులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారతాల సాయిరామ్ కిషోర్, గోనుపల్లి గురుమూర్తి, బల్లి కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలసాహిత్యం సమాజానికి అత్యవసరం



ప్రజాశక్తి - క్యాంపస్ : బాలసాహిత్యం నేటి సమాజానికి అత్యవసరమని ఎస్వీయు ఇంచార్జ్ విసి ఆచార్య అప్పారావు పేర్కొన్నారు. యస్వీయు, సెనేట్ హాల్లో ప్రముఖ బాలసాహిత్య వేత్త డా. గంగిశెట్టి శివకుమార్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా ఆదివారం అభినందన సభ నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఇంచార్జ్ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, పంచసహస్రావధాని డా. మేడసాని మోహన్‌లు అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును బాల సాహిత్య సృజనకుగాను ఇవ్వడం ఆనందం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో సి. గోవిందరాజు, జే. మునిరత్నం,డా.నాగసూరి వేణుగోపాల్, డా. ఎం.రామలింగయ్య, డా.వి. ఆర్. రాసాని, అంకమ నాయుడు , డా.రాజశేఖర్ మొదలైన వారు తమ స్పందనను తెలిపారు. ప్రాచ్య పరిశోధన సంస్థ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: 1983 – 84 బ్యాచ్ కి సంబంధించిన తిరుపతి నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా తిరుపతిలో జరిగింది. స్థానిక పైవైస్రాయ్ హోటల్లోని సెమినార్ హాలులో పూర్వ విద్యార్థులు కలుసుకొని పాత స్మృతులను నెమరేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. 42 ఏళ్ల తర్వాత కలుసుకోవడం కొందరికి ఉద్విగ్నంగా మారింది. పూర్వ విద్యార్థుల సంఘం తరపున కందారపు మురళి కేఎల్ వర్మలు ప్రతి ఏడాది స్నేహితుల దినోత్సవాన్ని తిరుపతిలో నిర్వహిస్తున్నారు. దీనికి సుదూర ప్రాంతాలలోని మిత్రులు పాల్గొనడం వారికి ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కందారపు మురళి ప్రధాన కార్యదర్శి కే లోకేశ్వర్ వర్మ, పగడాల అర్జున్ ఆర్ఆర్ శ్రీనివాస్ జయచంద్ర, శ్రీనివాసులు, సుబ్బారావు, రమేషు, బి సుబ్రహ్మణ్యం, మన్నేపల్లి బాలకృష్ణ, కందారపు సురేంద్ర, బివి రాయ్, ముని, చంద్రమౌళి, చెంగయ్య, గురుమూర్తి,గిరి,బాల, శేఖర్ రాజు,శ్రీనివాస్,ఉమా,క్రిష్ణయ్యలు ఈ సందర్భంగా మాట్లాడుతూ తమది అపూర్వ కలయిక గా అభివర్ణించారు. తిరుపతి నగరంలో మరి ఏ ఇతర పూర్వ విద్యార్థులు 42 ఏళ్లుగా ప్రతి ఏడాది కలుసుకుంటున్న పరిస్థితి లేదని తెలిపారు. తమ సంఘం తరపున పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టుగా పూర్వ విద్యార్థుల సంఘం తరపున నేతలు వివరించారు.

ఉద్యోగ విరమణ.. ఘన సన్మానం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కార్వేటినగరం పంచాయతీకి చెందిన ప్రధాన ఉపాధ్యాయులు ఢంకా హమీద్ బాషా ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా పుత్తూరు మైనారిటీ సోదరులు ఆయనను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎస్.కే.షబ్బర్, షేక్ సందాని, నగరి తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హమీద్ బాషా, యూనుస్‌లు పాల్గొన్నారు.

కార్వేటినగరం మండలం, కత్తెరపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తు ఉద్యోగ విరమణ చేసిన



మల్లికా రాణిని ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మల్లికా రాణి ఉపాధ్యాయురాలిగా ఉత్తమ సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కోలత్తూరు ముత్యాల రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్ శేఖర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్, సిపిఎస్ కన్వీనర్ నరేష్, పుత్తూరు మండల అధ్యక్షులు ఎన్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.51 వేలు విరాళం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి కాకినాడ జిల్లా చేబ్రోలుకు చెందిన రామకృష్ణ ఆదివారం రూ. 51 వేలు విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేసి నిత్యాన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా సూచించారు. అనంతరం దాతకు స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు.

హెల్మెట్ల పంపిణీ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : వెంకటగిరి పట్టణంలో ఆదివారం ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. పట్టణ పరిధిలోని త్రిభువని సెంటర్ వద్ద ప్రముఖ యూట్యూబర్ సురేష్ గురు పది లక్షలు ఫాలోవర్స్ రావడంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి రమణ పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు చేయూత



ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు, డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపి, గూడూరు టౌన్ క్లబ్, వెస్ట్ క్లబ్ సేవ కార్యక్రమాలలో భాగంగా మాజీ అధ్యక్షులు మురళి రాజు దాతృత్వంతో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థినికి కాలేజీ ఫీజు కోసం పది వేల రూపాయలు వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌వి రావు చేతులు మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ క్లబ్ అధ్యక్షులు జయ చంద్ర రెడ్డి, వై.జె.పి. క్లబ్ సెక్రటరీ మురళి కృష్ణ , ట్రెజరర్ గోపినాథ్ రెడ్డి, వినోద్ కుమార్, కావేరి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ సేవలు మరువలేవి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన బాలాజీ సేవలు మరువలేనివని మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డిసిపి మహబూబ్ ఖాన్‌లు తెలిపారు. ఆదివారం కచ్చపి ఆడిటోరియంలో జరిగిన సన్మాన సభలో వారు పాల్గొని ప్రసంగిస్తూ, బాలాజీ అంచెలు అంచెలుగా ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, రెవిన్యూ అధికారి సేతు మాధవ్ రవికుమార్, మున్సిపల్ కార్పొరేషన్ డీఈలు రమణకుమార్, మధుబాబు, పబ్లిక్ హెల్త్ డి కరుణాకర్ రెడ్డి తుడా మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు తిరుపతి చిత్తూరు జిల్లా అనంతపురం జిల్లా కడప జిల్లా రాజమండ్రి కాకినాడ నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు

రైతు అభివృద్ధే టీడీపీ ధ్యేయం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు చేయూతనందించినట్లు టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి బుచ్చినాయుడు కండ్రిగ తెలుగుదేశం మండల ప్రెసిడెంట్ సుధాకర్ నాయుడులు తెలియజేశారు. ఆదివారం ఉదయం ఉత్తెరి పంచాయతీ, పివి కండ్రిగ, ఆలత్తూరు పట్టాభి కాలనీ, బిఎస్పురం పంచాయతీల్లో వారు పర్యటించి ప్రజా సమస్యలు సేకరించారు. నియోజకవర్గంలో 7 మండలాలకు చెందిన 29653 మంది రైతులకు అన్నదాత సుఖీభవ తొలి విడత నగదు క్రింద రూ.20.38 కోట్లుఅంజూరు అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్నేహం వెలకట్టలేనిది



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అన్ని బంధాల కన్నా స్నేహబంధం ఎంతో విలువైనదనీ, దానికి వెలకట్టలేమని టిడిపి నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ అన్నారు. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. స్నేహితులతో కలిసి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాగమల్లి వినయ్, బాలాజీ రెడ్డి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుకలు



ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) చంద్రగిరి ప్రభుత్వ పాఠశాలలో 1974-75 వ సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థులు 50 సంవత్సరాలు పూర్తి కావడంతో పూర్వపు విద్యార్థులు స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఆదివారం నాగయ్యగారిపల్లి పూర్వపు విద్యార్థులు అసోసియేషన్ అధ్యక్షులు సంద్ర సిద్దయ్య చెందిన మ్యాంగో గార్డెన్‌లో పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మోహన్ రెడ్డి అధ్యక్షతన ఈ స్వర్ణోత్సవ కార్యక్రమం ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో పూర్వపు విద్యార్థులు అందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పూర్వపు విద్యార్థుల స్వర్ణోత్సవాలు సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. తమతో పాటు విద్యనభ్యసించి, మృతి చెందిన సహచరులకు నివాళులర్పించారు. వయసు మీరడంతో దురలవాట్లుకు దూరంగా ఉండి, ఆరోగ్య సూత్రాలను పాటించి, అవసాన దశలో కుటుంబ సభ్యులకు భారం కాకుండా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. పదవీ విరమణ పొంది వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారు ఈ స్వర్ణోత్సవ కార్యక్రమాలకు హాజరై పాలుపంచుకోవటం చాలా సంతోషదాయకమని సహచర మిత్రులు అభినందనలు తెలిపారు. పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చిన సంద్ర సిద్దయ్య నాయుడుకు, భోజన వసతి కల్పించిన నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీలో డివిజనల్ మేనేజర్‌గా పదవీ విరమణ పొందిన చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు సంద్ర సిద్ధయ్య నాయుడు, ఉపాధ్యక్షులు చంద్రబాబు నాయుడు, అప్పయ్య శాస్త్రి, కార్యదర్శి పార్లపల్లి పరందామరెడ్డి, టి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పరిసరాల పరిశుభ్రత అంద్ర బాధ్యతని వన్ టౌన్ సిఐ గోపి తెలిపారు. స్థానిక తుఫాన్ సెంటర్లో స్థానికుల చేత పరిసరాలను శుభ్రం చేయించారు. బహిరంగ మద్యపానం చేసే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అవసరమైతే తుఫాన్ సెంటర్లో సాయంత్రం వేళ పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

అవమానభారంతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : అవమానభారంతో ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొట్టంబేడు మండలంలోని జ్ఞానాంబకండ్రిగలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శివారెడ్డి(25) అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి అప్పు ఇచ్చాడు. అప్పు తీర్చమన్నందుకు తీసుకున్న వ్యక్తి అవమానించడంతో మనస్థాపానికి గురైన శివారెడ్డి శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

6 నుండి తొండమాన్ పురం శ్రీ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : తొండమాన్ పురం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆగస్టు 6 నుండి 9వ తేదీ వరకు పవిత్రోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఆగస్టు 6న సాయంత్రం 6 గంటలకు అంకురార్పరణంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి.

50 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అక్రమంగా మద్యం తరలిస్తున్న రాంబాబు అనే వ్యక్తిని తెలుగుగంగ కాలనీ వద్ద ఆదివారం రాత్రి టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ ఘట్టం

ప్రజాశక్తి - రామచంద్రపురం(తిరుపతి రూరల్):

తిరుపతి రూరల్ మండలం, దుర్గసముద్రంలో శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వార్షిక మహాభారత మహోత్సవంలో భాగంగా ఆదివారం దుర్యోధనవధ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీ వెంకటేశ్వర నాట్య కళా మండలి కళాకారులు శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగ మడుగులో దాక్కుని ఉన్న దుర్యోధనుని భీమసేనుడు పట్టుకొని యుద్ధానికి లాక్కుని వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం దుర్యోధనుని మట్టి ప్రతిమపై భీమ, దుర్యోధన ముష్టియుద్ధం సాగించారు. చివరగా భీమసేనుడు దుర్యోధని తొడపై గదతో కొట్టి వధించాడు. దుర్యోధన వధతో మహాభారత యజ్ఞం (వార్షిక మహాభారత ఉత్సవాలు)ముగిసాయి.

భక్తి, శ్రద్ధలతో అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాన్ని భక్తులు ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అగ్నిగుండంపై అగ్ని నిప్పులను పరిచి అగ్ని గుండానికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, చన్నీటి స్నానాలు ఆచరించి, అమ్మవారి కంకణాల కట్టుకొని, వేప పత్రి చేతుల పట్టుకుని శ్రీ ద్రౌపదీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నెత్తిన పెట్టుకుని ఓం శక్తి నామ స్మరణలు, నడుమ సుమారుగా 100 మంది పైగా అగ్నిగుండ ప్రవేశం చేసినట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

నేడు పుష్పయాగం.. వార్షిక మహాభారత ఉత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు ఆలయంలో పుష్ప యాగం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పుష్ప యాగం కార్యక్రమంలో భక్తులు, విశేషంగా పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

వరదయ్యపాలెం ఆరోగ్య కేంద్రాలపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : అంతర్జాతీయ పారిశ్రామిక నగరం సమీపంలోని ఆరోగ్య సమస్యలపై స్పందిస్తూ, సత్యవేడు, చిన్నపాండూరు, వరదయ్యపాలెం ఆరోగ్య కేంద్రాల పరిస్థితిని మెరుగుపరచాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు, జాతీయ చేనేత దేవాంగ నాయకుడు, డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజులు విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో ఆదివారం జరిగిన సమావేశానికిక మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నా, వైద్య సదుపాయాలలోపం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఫ్యాక్టరీలు, ఉద్యోగుల రాకతో జనసంచారం పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య కేంద్రాలను మెరుగు పరచాలని కోరారు. ఆధునిక వైద్య పరికరాలు, తగు సిబ్బంది నియామకం, 108 వాహనం వంటి సౌకర్యాలు కల్పించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు గుత్తి త్యాగరాజు తెలిపారు. స్పందించిన మంత్రి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జాతీయ కౌన్సిల్ మెంబెర్ మునిసుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యవేడు మునికృష్ణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యాళి వాహనంపై శోభాయాత్ర

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : పుత్తూరు పట్టణంలో శ్రీ ద్రౌపది దేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో (తిరునాళ్లు) భాగంగా ఆదివారం రాత్రి యాళి వాహనంపై ఊరేగి భక్తులకు అలౌకిక దర్శనం ఇచ్చారు. భక్తులు ఇంటింటా నారికేళ, కర్పూరనిరాజనాలతో అమ్మవారిని ఆరాధించారు. ఉదయం గెరిగ ఆలయంలో మంచినీళ్లగుంట, గరిగ నీటి అభిషేకం, విశేష అలంకరణతో అమ్మవారి ప్రత్యేక దర్శనం భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం మహాభారత హరికథ గానం, భరతనాట్యం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. బెస్త సంఘం ఆధ్వర్యంలో యాళి వాహన ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పాండవ -కౌరవ కుమారుల విద్యాభ్యాసం, నిర్వహణ కార్యక్రమాల దాత, తిరుపతి వాస్తవ్యులు మునిరాజా బ్రదర్స్ పేద విద్యార్థులకు సంచి, పలక, బలపం, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేసి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవ వైభవాన్ని ఆస్వాదించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు

బ్రహ్మోత్సవ వేడుకల్లో పట్టణానికి చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ 250 మంది విద్యార్థులు భక్తులకు సేవలందించారు. తోపులాటలు, భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడం సరైన విధంగా క్యూలైన్లను పాటింపచేయడం, తాగునీటిని అందివ్వడం వంటి విషయాల పై స్కౌట్ మాస్టర్ అశోక్ రేంజర్ లీడర్ శైలజ, యువ శ్రీ, భాను, మేఘన, చారులత తదితరులు పర్యవేక్షించారు.

పాపానాయుడుపేటలో పోలీస్ కవాతు



ప్రజాశక్తి -ఏర్పేడు : రేణిగుంట డీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పేడు సీఐ బి. శ్రీకాంత్ రెడ్డితో కలిసి రేణిగుంట, గాజులమండ్యం సిఐలు, ఎస్సైలు, ట్రైనీ ఎస్సైలు, సిబ్బంది పాపానాయుడు పేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ధర్మరాజుల వార్షిక ఉత్సవాల సందర్భంగా కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, ఆలయ ధర్మకర్తలతో చర్చించి తగు సూచనలు చేశారు.

వాకాడులో కార్డెన్ సెర్చ్



ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల కేంద్రంలో, వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ నాగబాబు ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాలు వంటి వాటిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో చిట్టమూరు ఎస్సై చిన్నబలరామయ్య, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పోలీసులు పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్ దశమ వార్షికోత్సవం



విద్యార్థులకు అభినందన పత్రాలను అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని రామకృష్ణ మిషన్ ఆశ్రమం దశమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి ఆశ్రమ కార్యదర్శి సుకృతానందజీ, నెల్లూరు ఆశ్రమ కార్యదర్శి హృదానందజీ, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షులు గంగవరం శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామి సుకృతానందజీ మాట్లాడుతూ అందరికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఇవ్వడానికి రామకృష్ణ మిషన్ స్థాపించబడిందన్నారు. తిరుపతి విభాగం 1995లో స్థాపించి సేవా కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. శారదా మాత ఆధ్యాత్మిక సూచనలు అనే అంశంపై మాట్లాడారు. స్వామి హృదానందజీ గృహస్థ భక్తులకు శ్రీ రామకృష్ణ ఉపదేశంను వివరించారు. ఇటీవల రామకృష్ణ మిషన్ చేపట్టిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు బహూకరించారు.

పారిపోయిన ఖైదీ అరెస్ట్



ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండల కేంద్రంలోని సబ్ జైలు నుండి పారిపోయిన ఖైదీ శ్రీనివాసులు అలియాస్ శీను (18) ను ఆదివారం సత్యవేడు పోలీసులు అరెస్ట్ చేశారు. సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరు మండలం, కారూర్ గ్రామానికి చెందిన శ్రీనివాసులు దొంగతనం కేసులో గత కొద్దిరోజులుగా సత్యవేడు సబ్ జైల్‌లో ఖైదిగా ఉన్నాడు. ఆదివారం ఉదయం ఖైదీలను కాల కృత్యాలకు అనుమతించిన సమయంలో శీను జైలు గోడ ఎక్కి పారిపోయాడు. విషయం తెలుసుకున్న జైల్ సూపరింటెండెంట్ కరిముల్లా సత్యవేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యవేడు పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళి నాయుడు ఆదేశాల మేరకు సబ్ ఇన్స్పెక్టర్ రామస్వామి బృందంతో కలిసి ఆదివారం సాయంత్రానికి పారిపోయిన ఖైదీ శీనును అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి పారిపోయిన శీనును కోర్టులో హాజరు పరచనున్నారు.

ఇంటర్వ్యూ

ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో పెరుగుతున్న అడ్మిషన్లు

ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి ఏ.రఘుపతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతులతో అడ్మిషన్లు పెరుగుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం, ఫీజు రియింబర్స్మెంట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెరిగేందుకు తోడ్పడుతోందని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఏ.రఘుపతి తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధిని తెలియజేశారు.



ప్రజాశక్తి: ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెరిగిందా..?

జిల్లా అధికారి: చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఏడాది కంటే ఏడాది 1000 మంది విద్యార్థులు అదనంగా పెరిగారు.

ప్రజాశక్తి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎలాంటి మౌలిక వసతులు కల్పిస్తున్నారు..?

జిల్లా అధికారి: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించడం జరిగింది. తాగునీరు, మరుగుదొడ్లు, లేబరేటరీ, లైబ్రరీ, కంప్యూటర్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది.


ప్రజాశక్తి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు పూర్తిస్థాయిలో ఉన్నారా..?

జిల్లా అధికారి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత, అనుభవం కలిగిన అధ్యాపకులు విద్యార్థులకు చక్కటి బోధన అందిస్తున్నారు. ఇటీవల ఒప్పంద అధ్యాపకులను నియమించడం జరిగింది.

ప్రజాశక్తి: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఎన్ని ఉన్నాయి..?

జిల్లా అధికారి: ప్రభుత్వ గుర్తింపు పొందిన బాలుర, బాలికల జూనియర్ కళాశాలలు 130 వరకు ఉన్నాయి. ఈ కళాశాలలో గత ఏడాది 27,500 అడ్మిషన్లు జరిగితే ఈ ఏడాది 28,120 అడ్మిషన్లు జరిగాయి. అడ్మిషన్లు ఈనెల 11వ తేదీ వరకు పెంచడంతో మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించడం జరుగుతోంది. పోటీ పరీక్షలకు అవసరమయ్యే తర్ఫీదును అందించడం జరుగుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలను కూడా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.





నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 4వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 7వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీసుశాఖలో..

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.









